క్లుప్తంగా

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్



దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో ఆటో డ్రైవర్లకు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు ఆదివారం కౌన్సెలింగ్ చేశారు. ఆటోడ్రైవర్లు లైసెన్స్‌ల తోపాటు ఆటోకు రిజిస్ట్రేషన్ కాగితాలు, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, యూనిఫామ్ ధరించాలని స్పష్టం చేశారు. ఆటోలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ల బాధ్యులు బండి శ్రీనివాస్, బాబురావు, బూర రామకృష్ణ, రాజు, గైని భాస్కర్, సాబిర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

నివాళి



చెన్నారావుపేట : మండలంలోని లింగగిరికి చెందిన మంద నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదివారం పరామర్శించారు. తొలుత నారాయణ చిత్రపటానికి ఎమ్మెల్యే మాధవరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, మంద యాకయ్యగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేశ్, నాయకులు బండి హరీశ్, గజ్జి రాజు, చిందం కుమార్, మాదారపు భాస్కర్, భద్రునాయక్, మల్లం వేణు, తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుడి మృతదేహానికి..

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన నాయీబ్రాహ్మణుడు ఎడ్ల రమేశ్ (47) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందగా ఆయన మృతదేహానికి నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల మురళి, అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మురహరి రవి, మండల అధ్యక్షుడు సమ్మెట భిక్షపతి, గౌరవ అధ్యక్షుడు పోలెపల్లి భిక్షపతి, మండల ఉపాధ్యక్షులు ఎడ్ల మల్లయ్య, సూత్రపు సుధాకర్, పోలెపల్లి రమేశ్, కుమారస్వామి, ఏకాంబరం, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. రమేశ్ అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఘనంగా బీరన్న బోనాలు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని బీరన్న ఆలయంలో యాదవులు ఆదివారం బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మండల కేంద్రంతో పాటు గుడెప్పాడ్, తిరుమలగిరి గ్రామాల్లోను గొల్ల కురుమలు బీరన్న ఆలయానికి డప్పు చప్పుళ్లతో చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. పిల్లాపాపలను సల్లగా చూడాలని వారు ప్రత్యేక పూజలు చేశారు.

మొహర్రం ఏర్పాట్ల పరిశీలన

ఖిలా వరంగల్: మొహర్రం సందర్భంగా ఈనెల 17న మధ్యకోటలో నిర్వహించనున్న పీరీల ఊరేగింపు ఏర్పాట్లను ఎస్సై శ్రీకాంత్ ఆదివారం పరిశీలించారు. ముజావరీలను అడిగి తెలుసుకున్నారు. ఊరేగింపులో పాల్గొనే ముస్లిం యూత్ సభ్యుల వివరాలను సేకరించారు. అనంతరం ఎస్సై శ్రీకాంత్‌కు ముజావరి దట్టికట్టి నెమిలి ఈకలతో ఆశీర్వదించారు.

భవనంపై నుంచి పడి కార్మికుడికి తీవ్రగాయాలు

ఖిలా వరంగల్: ప్రమాదవశాత్తు భవనం మొదటి అంతస్తు నుంచి కార్మికుడు జారి కింద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలోని వినాయక నగర్ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు, స్థానికుల కథనం ప్రకారం మహారాష్ట్రకు చెందిన లక్ష్మీచందు గతేడాది వరంగల్‌కు వలస వచ్చి భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం భవనం మొదటి అంతస్తు వద్ద కర్రపై నిలబడి ఇసుక, సిమెంట్ అందుకుంటున్న క్రమంలో ఒక్కసారిగా గోవకర్ర విరిగి కిందపడిపోయాడు. దాంతో అతడి తల, నడుముకు తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఖిలా వరంగల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు పోశాల శ్రీనివాస్ సూచించారు. హనుమకొండ శ్రీదేవి ఏషియన్ మాల్‌లో యోగా అభ్యాసం చేస్తున్న సాధకులు.. వన్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం ఖిలా వరంగల్ రాతికోటపై హరిత యోగా శిబిరం ఆధ్వర్యంలో ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ యోగాతో దీర్ఘకాలిక రుగ్మతలైన బీపీ, షుగర్, అల్సర్, ఆస్తమా, తీవ్రమైన నొప్పులు, నడుం నొప్పులు తగ్గుతాయని తెలిపారు.



గీసుకొండ : నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు



దుగ్గొండి : నాచినపల్లి స్కూల్‌లో..

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

గీసుకొండ : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1989–2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. మళ్లీ 34 ఏళ్ల అనంతరం కలుసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. నాటి ప్రధానోపాధ్యాయుడు గుడిపూరి సత్యనారాయణరావుతోపాటు నాటి ఉపాధ్యాయులు సయ్యద్ అలీ అక్బర్, కందుకూరి దేవేంద్రచారి, కళ్యోజ్వల రమణాచారి, తాడ మోహన్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఇక నుంచి ఒకరికొకరు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. అనంతరం తాము చదివిన పాఠశాలకు రూ.10 వేల విలువైన బీరువా బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మిడివెల్లి పట్టాభి, ఉపాధ్యాయులు కర్ణకంటి రామ్మూర్తి సమన్వయకర్తలుగా వ్యవహరించారు.



నెక్కొండలో..

నాచినపల్లి హైస్కూల్‌లో..

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో 2003–04 విద్యాసంవత్సరంలో టెన్త్ చదువుకున్న విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. కష్టాల్లో ఉన్న సహచరులకు అండగా నిలవాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు రవీందర్, సోమదాసు, శ్రీనివాసాచార్యులు, రమాదేవి, సరోజినీ దేవి, సోమరాజు, నారాయణరాములు, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, నాటి విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవీ కల్యాణ మండపంలో..

నెక్కొండ : కరుణశ్రీ విద్యాలయంలో 2010–11 విద్యాసంవత్సరం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు మారోజు వెంకటేశ్వర్లు, గుండోజు ప్రసాద్, ఈదునూరి వెంకటేశ్వర్లు, మల్లేశం, గోపి, ప్రవీణ్‌కుమార్‌లను సన్మానించారు. కార్యక్రమంలో నాటి విద్యార్థులు ప్రణీత్, అఖిల్, శ్రీకాంత్, నరేందర్, నవ్య, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

సేవా రంగంలో వినీత్‌కు గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న వినీత్

పర్వతగిరి : మండలంలోని ముంజాలకుంట తండా శివారులోని నరేంద్రతండాకు చెందిన తేజావత్ వినీత్ ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. వినీత్ కరోనా సమయంలో పేదలకు నిత్యావసర సరుకులు, మాస్కులు, శానిటైజర్లు అందించి ఆరోగ్య పరిరక్షణలో ఎనలేని కృషి చేశారు. తదనంతరం సామాజిక సేవలను మరింత విస్తరించారు. ఆరోగ్యం పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ చైతన్యవంతం చేస్తున్నారు. పేదలకు దుస్తులు, దుప్పట్లు అందిస్తున్నారు. పేద విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందిస్తూ నిత్యం ప్రజాసేవలో ఉంటున్నారు. నిరంతరం సేవలు అందిస్తున్న క్రమంలో ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వినీత్‌కు సేవా రంగంలో గౌరవ డాక్టరేట్ అందజేసినట్టు పేర్కొంది. ఈ సందర్భంగా వినీత్ మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లుగా తాను చేస్తున్న సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ వచ్చిందన్నారు. సామాజిక సేవల్లో తన బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. భవిష్యత్‌లోనూ పేదలకు సేవలు అందించడంలో ముందుంటానని చెప్పారు.

ఘనంగా పీరీల ఊరేగింపు



నల్లబెల్లి : ఈనెల 17న మొహర్రం జరుపుకోనున్న నేపథ్యంలో మండల కేంద్రంలో మహ్మద్ నాసర్ ఆధ్వర్యంలో ఆదివారం పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. హిందువులు, ముస్లింలు దట్టి కట్టి మలీద ముద్దలు సమర్పించారు. పలువురు భక్తులు మొక్కులు చెల్లించారు.

‘ముదిరాజ్’లను బీసీ-ఏలోకి మార్చండి



రాయపర్తి : వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, నాయకులు

రాయపర్తి : ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు బండారి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 నుంచి 20 వరకు తలపెట్టనున్న ముదిరాజ్ మహాసభ పోరాట కార్యాచరణ వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్ కులస్తులకు అనేక హామీలు ఇచ్చిందని చెప్పారు. ముదిరాజ్ కులస్తులు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇతర అన్ని రంగాల్లోనూ ముదిరాజ్ కులస్తులు వెనుకబడి ఉన్నారని తెలిపారు. రెవెన్యూ కార్యాలయాల ముట్టడికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మత్స్య సొసైటీ జిల్లా డైరెక్టర్ చెవ్వ కాశీనాథం, టీఆర్‌ఎంఎస్ మండల అధ్యక్షుడు ముద్రబోయిన సుధాకర్, ఉపాధ్యక్షుడు షాపురం సాయిలు, మైలారం, సొసైటీల అధ్యక్షులు బోయిని కుమార్, నారబోయిన యాకయ్య, జంగిలి నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

భూమి లేని పేదలకు రూ.లక్ష ఇవ్వాలి

రాయపర్తి (వర్ధన్నపేట) : రైతులకు రైతుభరోసా పేరుతో పెట్టుబడి సాయం అందిస్తున్న తరహాలోనే భూమి లేని పేదలకు ఏటా రూ.లక్ష సాయం అందించాలని దళిత నిరుద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వర్ధన్నపేటలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి లేని నిరుద్యోగ యువత, పేదలు ఇళ్ల అద్దె చెల్లించడంలోనూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పేద నిరుద్యోగ యువత ఉద్యోగాలు దొరక్క మానసిక వేదనకు గురవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వం పేదలకు ప్రభుత్వ భూములు పంపిణీ చేయాలని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న పథకాన్ని రూ.40 లక్షలకు పెంచాలని కోరారు. సమావేశంలో కంజర్ల సమ్మయ్య, కందికట్ల తిరుమలేశ్, గబ్బెట బాబు, మునిగాల తరుణ్, తేజ, చల్లా మిథున్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

నేటి ర్యాలీని విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న

పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ముదిరాజ్ కులస్తులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నేడు (సోమవారం) తలపెట్టిన ర్యాలీని విజయవంతం చేయాలని మత్స్య సొసైటీ మండల అధ్యక్షుడు నీరటి వెంకన్న కోరారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు కావస్తున్నా ముదిరాజ్ కులస్తులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. నేడు (సోమవారం) మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించనున్న ర్యాలీలో ముదిరాజ్ కులస్తులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి పల్లెబోయిన అశోక్, ఎన్‌ఆర్‌ఐ విభాగం రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు చొప్పరి సోమన్న, జిల్లా కార్యదర్శి నీరటి సదానందం, గుండ రాకేశ్, మెపా జిల్లా అధ్యక్షుడు పిట్టల రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు తెలంగాణ ఉద్యమ కళాకారుల సమ్మేళనం

దుగ్గొండి : తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొని నిరుద్యోగులుగా మిగిలిన కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నేడు (సోమవారం) హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో నిర్వహించనున్నట్లు నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా నాయకుడు సింగనబోయిన లింగన్న తెలిపారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. స్వరాష్ట్రం కోసం తిండితిప్పలు మానుకుని గళమెత్తిన కళాకారులు గత ప్రభుత్వ ఆదరణ నోచుకోక దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారని తెలిపారు. కళాకారుల అన్ని సమస్యల పరిష్కారానికి పోరాట ప్రణాళిక, ఉద్యమ కళాకారుల జాబితా రూపొందిస్తామని చెప్పారు. సమ్మేళనానికి నిరుద్యోగ కళాకారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

గీత కార్మికులకు రక్షణ కిట్ల పంపిణీ అభినందనీయం



రాయపర్తి (వర్ధన్నపేట) : రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులను ప్రమాదాల బారి నుంచి కాపాడేలా కాటమయ్య రక్ష కిట్లు పంపిణీ చేయడం అభినందనీయమని గౌడ జర్నలిస్టు సంఘం నాయకుడు దొమ్మటి భానుచందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని గీత కార్మికులు కులవృత్తిలో భాగంగా తాటి, ఈత చెట్లు ఎక్కి కల్లు గీసే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్న విషయాన్ని గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డి కిట్ల పంపిణీకి నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కల్లు గీత కార్మికుల రక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కిట్లలో తాడు, క్లిప్పులు, హ్యాండిల్స్, స్లింగ్ బ్యాగు, లెగ్ లూప్ వంటి పరికరాలను అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

గుంతల పూడ్చివేత

దామెర : మండలంలోని వెంకటపూర్‌లోని రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంతలను ఎస్సై అశోక్ పరిశీలించి పూడ్చివేయాలని స్థానికులను ఆదేశించారు. దీంతో మాజీ సర్పంచ్ పున్నం సంపత్, స్థానికులు పొక్లెయినర్‌తో గుంతలను పూడ్చివేశారు. అనంతరం సంపత్‌ను, స్థానికులను ఎస్సై అశోక్ అభినందించారు.

భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

ఖిలా వరంగల్: నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా కోరారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఎండీ.అక్బర్ పాషా అధ్యక్షతన ఆదివారం మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి ముక్కుతాడు వేసేలా గట్టి ప్రతిపక్షం ఏర్పడిందని చెప్పారు. గతంలో మాదిరిగా మోదీ నిరంకుశ, నియంతృత్వ పాలనకు కాలం చెల్లిందని ఎద్దేవాచేశారు. దేశంలో మతం పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్న ఎన్డీఏ ఆగడాలను అరికట్టేందుకు వామపక్ష లౌకిక శక్తులను కాంగ్రెస్ కలుపుకొనిపోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, ఎలేందర్, సౌందర్య, భవాని, తీగల కుమార్, యాకూబ్, రవి, రాజేందర్, ఎండీ.నవాంబీ, విజయలక్ష్మి, సువర్ణ, దివ్య, కుమార్, ప్రభాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పదవులు ఖాయం



చెన్నారావుపేట : కుమారస్వామిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి



నర్సంపేట : శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న యాకూబ్‌రెడ్డి, నాయకులు

● నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

చెన్నారావుపేట : ప్రజాసేవ చేసే అర్హులైన నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం పదవులు కట్టబెట్టడం ఖాయమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రానికి చెందిన కోరె కుమారస్వామి నర్సంపేట వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌గా నియమితులైన క్రమంలో ఆయన్ను మండల నాయకులు జోరు వీరయ్య, కుండె కుమారస్వామి, బొంత శ్రీను, తోట రాములుతో కలిసి ఎమ్మెల్యే మాధవరెడ్డి ఆదివారం సన్మానించి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. తద్వారా పార్టీ బలోపేతానికి పాటుపడాలని సూచించారు. పార్టీకి, ప్రజలకు సేవ చేసే వారికి అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుందని తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు..

నర్సంపేట : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన క్రమంలో పాలాయి శ్రీనివాస్‌ను పట్టణంలో పలువురు నాయకులు ఆదివారం శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎర్ర యాకూబ్‌రెడ్డి, కందగట్ల టాకా రాజు, కల్వచర్ల ప్రవీణ్‌చారి, బలభక్తుల బ్రహ్మాచారి, ఎస్.చందు, సర్వర్, తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్‌ఆర్‌ఆర్’ అధినేత శ్రీనివాస్‌రెడ్డి ఔదార్యం

● కేజీబీవీకి బోరు మోటారు వితరణ

రాయపర్తి : ఎస్‌ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి మండలంలోని తిర్మలాయపల్లిలోని కేజీబీవీ హాస్టల్‌కు రూ.20 వేల విలువైన బోరు మోటారు వితరణ చేసి ఔదార్యం చాటుకున్నారు. హాస్టల్‌లోని బోరు మోటారు కాలిపోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రామానికి చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముద్రబోయిన వెంకటేశ్వర్లు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్పందించి సమస్యను శ్రీనివాస్‌రెడ్డికి వివరించి సాయం చేయాల్సిందిగా అభ్యర్థించారు. ఆమె సూచన వెంటనే శ్రీనివాస్‌రెడ్డి వెంటనే కేజీబీవీలో ఆదివారం బోరు మోటారు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు, శ్రీనివాస్‌రెడ్డికి, వెంకటేశ్వర్లుకు విద్యార్థులు, ఎస్‌ఓ, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మచ్చ కుమారస్వామి, మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, అశోక్, గజవెల్లి రామశేఖర్, శీల ఎల్లారెడ్డి, సంపత్, ప్రిన్సిపాల్ కవిత, జోత్స్న, తదితరులు పాల్గొన్నారు.



బోరు మోటారు వద్ద వెంకటేశ్వర్లు, తదితరులు

నాటుసారా విక్రేతపై కేసు నమోదు



రాయపర్తి : నిందితుడితో సీఐ స్వరూప, సిబ్బంది

రాయపర్తి (వర్ధన్నపేట) : మండలంలోని కుమ్మరికుంటతండా, డీసీతండా, గుబ్బెడుతండాల్లో దాడులు నిర్వహించి కుమ్మరికుంట తండాకు చెందిన ధారావత్ గణేశ్ నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్టు వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్సై సరిత, సిబ్బంది పి.రమేశ్‌బాబు, సీహెచ్.రమేశ్ బాబు పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తుండగా..

సంగెం : మండలంలోని పుటాన్ తండా నుంచి గాంధీనగర్‌కు ద్విచక్ర వాహనంపై 5 లీటర్ల గుడుంబా తరలిస్తుండగా బానోత్ దస్రూను అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపారు. దస్రూ నుంచి 5 లీటర్ల గుడుంబా, బైక్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



వీరయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కుమారస్వామి, నాయకులు

చెన్నారావుపేట : దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ పల్లకొండ కుమారస్వామి కోరారు. వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికై ప్రమాణం స్వీకారం చేసిన సందర్భంగా ముత్తినేని వీరయ్యను హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో కుమారస్వామి ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుమారస్వామి మాట్లాడారు. దివ్యాంగులకు రాష్ట్ర, జిల్లా డైరెక్టర్, ఇతర నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కోరారు. దివ్యాంగులకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఏటా దివ్యాంగుల సమస్యలపై చర్చించి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ప్రతి నెలా 10లోపు పింఛన్ అందించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అనుబంధ వికలాంగుల విభాగం వరంగల్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సయ్యద్ అసద్, నర్సంపేట ఇన్‌చార్జ్ ఆకారపు శ్రీను, మాజీ ఎంపీటీసీ ధారావత్ భద్రు, నాయకులు కూస సుదర్శన్, సుధాకర్, అడ్డూరి వీరాచారి, పులి రమేశ్, ఫయాజ్, నరేశ్ పాల్గొన్నారు.

సంఘం సభ్యుల సంక్షేమానికి కృషి

ఖిలా వరంగల్: సంఘ సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని ఏకశిల సేవా సంఘం శివనగర్ అధ్యక్షుడు బుదారపు భాస్కర్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని ఆర్యవైశ్య భవనంలో ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ రాజేష్ అధ్యక్షతన సంఘం వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చనిపోయిన సంఘం సభ్యులకు రూ.35వేల ఎక్స్‌గ్రేషియా, సభ్యులకు సాధారణ రుణం రూ.లక్ష ఇరవై వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. వార్షిక లాభాల నుంచి ప్రతి సభ్యుడికి రూ.5వేలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం ప్రధాన కార్యదర్శి శ్రీరాం రాజేష్ ప్రవేశపెట్టిన వార్షిక లావాదేవీలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం అధ్యక్షుడిగా వైట్ల మల్లేశం, ప్రధాన కార్యదర్శి శ్రీరాంరాజేష్, కోశాధికారి వాసం రమేష్‌ను ఎన్నుకున్నారు.